# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తుంగభద్ర జలాశయం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో కొత్త పాలకమండళ్లు ఏర్పాటు చేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

3. **రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పాఠ్యప్రణాళికను సమీక్షించి మార్పులు, చేర్పులు చేయాలని ఇంటర్ విద్యామండలి నిర్ణయించింది.**

4. **ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3 వేల 619 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల సర్వీసును పునరుద్ధరిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.**

5. **ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానంలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రేపటి నుంచి పరీక్షలు నిర్వహించనుంది.**

==========================

కర్ణాటకలో వరద ఉధృతి కారణంగా తుంగభద్ర జలాశయం 19వ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు తుంగభద్ర జలాశయం అధికారులతో మాట్లాడాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తాత్కాలిక గేటు ఏర్పాటుపై చర్చించి, తగిన సహకారం అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఘటనాస్థలికి ఇంజనీర్ల బృందం, సెంట్రల్ డిజైన్ కమిషనర్ వెళ్లారని మంత్రి రామానాయుడు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించామని.. కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

-------------------------

రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో కొత్త పాలకమండళ్లు ఏర్పాటు చేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తిరుమల నుంచే దేవదాయశాఖలో ప్రక్షాళన మొదలైందని అన్నారు.

అమరావతి సచివాలయం బ్లాక్-2లోని తన ఛాంబర్‌లో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం దేవదాయ శాఖకు సంబంధించిన పలు దస్త్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భగవంతుడి ఆస్తుల రక్షణే తమ ప్రభుత్వ కర్తవ్యమని పేర్కొన్నారు. 27 వేల 127 ఆలయాల పరిధిలో 4 లక్షల 65 వేల ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆలయ భూముల్లో ఆక్రమణలు తొలగిస్తామని ఆనం రామ నారాయణ రెడ్డి చెబుతూ..

.....వాయిస్... 22 సెకన్లు....

---

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పాఠ్యప్రణాళికను సమీక్షించి మార్పులు, చేర్పులు చేయాలని ఇంటర్ విద్యామండలి నిర్ణయించింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి నూతన పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తేనుంది. పదేళ్ల తర్వాత పాఠ్యాంశాల మార్పులకు నిర్ణయం తీసుకుంది. ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంటర్ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు ఉన్నత విద్యను అనుసంధానించేలా మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్ మార్కుల స్థానంలో గ్రేడ్‌ల విధానం తీసురావడంపైనా అధ్యయనం చేయనున్నారు. పారిశ్రామిక రంగాలు గ్రేడింగ్‌కు మొగ్గు చూపుతున్నాయని, అందువల్ల ఈ విధానంపై దృష్టిసారించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ విధానం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

---

కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ నియమితులయ్యారు. కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 30వ తేదీ నుంచి రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. క్యాబినెట్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే వరకు ఆయనను క్యాబినెట్ సెక్రటేరియట్‌లో 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ'గా నియమిస్తూ.. అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. 1987 బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సోమనాథన్.. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా ఉన్నారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులతో నమూనాలు చేయించాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంపై గుంటూరు జిల్లా తాడేపల్లిలో రెండు రోజులు జరిగిన కార్యశాల ముగింపు సందర్భంగా నిన్న ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గానికీ ఇద్దరు నమూనా రూపకర్తలతో ప్రకృతి వ్యవసాయ నమూనాలు చేయిస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ సేంద్రియ సాగులో నైపుణ్యం సాధించిన వారు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని, ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా, పోర్చుగల్ నుంచి గుల్బెంకియన ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ అవార్డు పొందిన అనంతపురం జిల్లా మహిళా రైతు నెట్టెం నాగేంద్రమ్మను ఘనంగా సత్కరించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3 వేల 619 మంది కాంట్రాక్టు జూనియర్

లెక్చరర్ల సర్వీసును పునరుద్ధరిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే సంవత్సరం ఏప్రిల్ వరకు ఈ ఒప్పందం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పనితీరు ఆధారంగా 558 మందిని తొలగించాలని గత ప్రభుత్వం విద్యా సంవత్సరం చివర్లో నిర్ణయం తీసుకుంది. అయితే జూనియర్ లెక్చరర్ల విజ్ఞప్తితో మంత్రి లోకేష్ వారిని తొలగించొద్దని ఆదేశించడంతో అందరి సర్వీసును పునరుద్ధరించారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్..సీబీఎస్ఈ విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించనుంది. రేపటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు, మళ్లీ 17వ తేదీన ట్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు. తెలుగు మినహా మిగిలిన నాలుగు సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించి, ఫలితాల ఆధారంగా విద్యార్థులకు సీబీఎస్ఈ పరీక్షలు నిర్వహించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పది యాజమాన్యాల్లో వెయ్యి పాఠశాలలకు గతంలో సీబీఎస్ఈ అనుబంధ గుర్తింపు తీసుకున్నారు. వీటిల్లో చదువుతున్న 82 వేల 764 మంది విద్యార్థులు 2025లో సీబీఎస్ఈ పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు.

---------------------------

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత నట్వర్‌సింగ్ తుది శ్వాస విడిచారు. అనారోగ్యంతో గత రెండు వారాలుగా హరియాణా గుర్‌గ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గత అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 93 సంవత్సరాలు. నట్వర్సింగ్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని లోధి రోడ్ శ్మశానవాటికలో రేపు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నట్వర్ సింగ్ 1931లో రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలో జన్మించారు. మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా పనిచేశారు. 1984లో నట్వర్‌సింగ్‌కు పద్మ భూషణ్ పురస్కారం లభించింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....28 సెకన్లు....

---------------------------

ప్రజల్లో దేశభక్తిని మరింత పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తెలిపారు. తిరుపతిలోని బీజేపీ కార్యాలయంలో ఈ రోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

=====================